క్లుప్తంగా

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ



రైల్వే న్యూకాలనీలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

తాటిచెట్లపాలెం: ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో సంభవించిన ఆకస్మిక వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం రైల్వే న్యూకాలనీ శ్రీకన్య థియేటర్ ప్రాంతంలో పార్టీ నాయకులు విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అప్పలరాజు, గౌరీష్, మాధవి, జ్యోతి, వెంకన్న, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో జోరుగా కందిపప్పు విక్రయాలు



కందిపప్పు కౌంటర్ వద్ద వినియోగదారులు

సీతమ్మధార: మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సీతమ్మధార రైతుబజారులో కిలో కందిపప్పు రూ.150కు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరగడంతో పేదలకు అందుబాటులోకి తేవాలని కిలో రూ.160 ఉన్న కందిపప్పుపై రూ.10 తగ్గించారు. రైతుబజారులో కందిపప్పు కౌంటర్ వద్ద బుధవారం వినియోగదారులు బారులు తీరి కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 వరకు అమ్ముతున్నారు. బియ్యం కిలో రూ.48కు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.60 వరకు ధర ఉంది.

ఆటో డ్రైవర్ అదృశ్యం



చావన్ యేసు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెం గ్రంథాలయం వీధిలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న చావన్ యేసు ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఇంతవరకూ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో యేసు భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యేసు ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

డ్రెయిన్ కల్వర్టు శిథిలం



సీతంపేట హరిజన వీధిలో శిథిలమైన డ్రెయిన్ కల్వర్టు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట హరిజన వీధిలో డ్రెయిన్ కల్వర్టు అధ్వానంగా ఉంది. డ్రెయిన్‌పై వేసిన రాతి పలకలు, డ్రెయిన్ గట్లు శిథిలమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్ గట్లు నిర్మించి, పైన సిమెంట్ పలకలు వేసి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సిద్ధమవుతున్న మట్టి గణపతులు



- పర్యావరణ హితంగా విగ్రహాల తయారీ
- కోల్‌కతా కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న ప్రతిమలు



పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు

మద్రిపాలెం: కాలుష్య రహితం.. పర్యావరణ హితం మట్టి వినాయకుడికి ప్రజలు జైకొడుతున్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారవుతామని భావిస్తున్నారు. దీనికి తగ్గట్టు వినాయక చవితి పర్వదినాన మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని, దీనివల్ల ప్రకృతి కూడా ఆనందిస్తుందని అందరూ పేర్కొంటున్నారు. హిందువుల ముఖ్య పండగల్లో ఒకటైన వినాయక చవితి సమీపిస్తుండటంతో నగరంలో విగ్రహాల తయారీ మొదలైంది. కనీసం రెండు మూడు నెలలు నిగ్రహంతో గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా కేవలం కర్ర, గడ్డి, మట్టితోనే రూపొందించిన విగ్రహాలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

మూడున్నర నెలల పాటు శ్రమించి..

కోల్‌కతాకు చెందిన నబకుమార్ దిండా 11 మందితో కలిసి మూడున్నర నెలల పాటు శ్రమించి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తారు. కేవలం వినాయకుడివి కాకుండా, దసరా నవరాత్రుల కోసం దుర్గాదేవి విగ్రహాలను కూడా తయారు చేసి వెళ్తుంటారు. ఇలా 31 ఏళ్ల నుంచి ప్రతి ఏటా నగరంలోని ఏదో ఒక ప్రాంతంలో వీరు కొనుగోలుదారులకు నచ్చేలా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం 53వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద నబకుమార్ దిండా బృందం కొద్ది రోజులుగా వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారు. అడుగు మొదలుకుని 15 అడుగుల వరకు వీరు మట్టి బొమ్మలను తయారు చేసి ఆర్డర్‌పై విక్రయిస్తారు. దిండా వద్ద 11 మంది పనిచేస్తున్నారు. వీరంతా వెస్ట్ బెంగాల్‌కు చెందిన వారే. కనీసం 100 విగ్రహాల వరకు వారు విక్రయిస్తారు. ఇలా మూడు నెలలు రాత్రి పగలు కష్టపడి విగ్రహాలను తయారు చేసి సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు లాభాన్ని పొందుతారు. పర్యావరణ ప్రేమికులు ఎక్కువగా వీరి వద్ద విగ్రహాలు తయారు చేయిస్తుంటారు.



విగ్రహ తయారీ సామగ్రిని సిద్ధం చేస్తున్న కార్మికుడు

ట్రెండ్‌కు తగ్గట్టు విగ్రహాల తయారీ



ట్రెండ్‌కు తగ్గట్టు ఆకర్షణీయ మోడళ్లలో గణపతి, దుర్గాదేవి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఆర్డర్ ఇచ్చేవారు కోరుకున్న విధంగా విగ్రహాలు చేసి వారికి అప్పగిస్తాం. మూడు నెలల పాటు అంతా కష్టపడి రకరకాల ప్రతిమలు తయారు చేస్తాం. వాటికి ఎటువంటి కెమికల్స్ వినియోగించం. కేవలం వాటర్ కలర్స్ మాత్రమే వాడుతాం. – నబకుమార్ దిండా, విగ్రహాల తయారీ యజమాని

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



గ్రీన్‌గార్డెన్స్ సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టీని పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

మద్రిపాలెం: సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ సూచించారు. 53వ వార్డు మద్రిపాలెంలోని గ్రీన్‌గార్డెన్స్ 295 సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రాధాన్యాన్ని బట్టి సచివాలయ సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం హాజరు పట్టీని పరిశీలించారు. సమయపాలన పాటించకపోవడం, సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం వంటి ఆరోపణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ లక్ష్మణ్‌కు జెడ్సీ కృష్ణ చీవాట్లు పెట్టారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనితీరు మార్చుకోవాలని అతడికి సూచించారు. జోన్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎస్ఏఎల్‌పీజీ, ఎన్‌జీవో–యునైటెడ్ వే ముంబై సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం యునైటెడ్ ఫర్ రోడ్ సేఫ్టీ ప్రోగ్రాం నిర్వహించారు. సంస్థ ఇన్‌చార్జి సంతోష్ పర్యవేక్షణలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు రోడ్డు భద్రతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సంస్థ సభ్యులు విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేశారు. ఉత్తమ చిత్రాలను గీసిన విద్యార్థులను ఎంపిక చేశారు. విశాఖ పోలీస్ కమిషనర్ సమక్షంలో ఫైనల్ పోటీలు జరుగుతాయని సంతోష్ తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్ఎం ఆర్ శ్రీనివాస్‌రావు, చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఎన్.సాయిశంకర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సిహెచ్.కిషోర్, కె.సూర్యతేజ, కామేశ్వరరావు, మనోహరి, పాఠశాల పీడీఈ ఆర్.బాలరాజు, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్ సూరిశెట్టి రేణుకాదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో 11 కేవీ ఎయిర్‌పోర్ట్ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అంబేడ్కర్ నగర్, సాయినగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, పార్వతీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో..

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో హెచ్‌టీ లైన్లపై నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శంకువానిపాలెం, సరోజిని హాస్పిటల్ ప్రాంతం, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతం, 80 ఫీట్ రోడ్, చిన్నూరు, ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కంచరపాలెం సెక్షన్‌లో..

కంచరపాలెం: కంచరపాలెం సెక్షన్ పరిధిలోని 11 కేవీ కంచరపాలెం ఫీడర్ లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గవర కంచరపాలెం, దుర్గానగర్, గౌరీనగర్, రెడ్డికంచరపాలెం, సుభాష్‌నగర్, గోకుల్‌నగర్, గొల్లకంచరపాలెం, మళ్లసూరివీధి, వివేకానందవీధి, జాషువానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మద్రిపాలెం: తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి అన్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి గంటలో తల్లిపాలు ఎంతో ముఖ్యమన్నారు. ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలన్నారు. రేపటితరం చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు ఎంతో అవసరమని చెప్పారు. అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయించి, అనంతరం పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఏంజెలీనా, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

తాటిపండ్లకు గిరాకీ



తాటిపండ్లతో రైతు లింగమ్మ

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో తాటిపండ్లకు గిరాకీ పెరిగింది. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, పాతవలసకు చెందిన టి.లింగమ్మ, టి.బుచ్చమ్మ రైతులు రైతుబజారుకు తాటి పండ్లు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఒక పండు రూ.20కు విక్రయిస్తున్నామని, తాటి పండుతో గారెలు, కుడుములు చేసుకోవచ్చని చెప్పారు. చాలా రుచిగా ఉంటాయని, ఈ నెలంతా విక్రయిస్తామన్నారు.

25 నుంచి సంస్కృతంలో ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు మళ్ల వెంకటరావు, సూర్యకుమారి

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్, సంస్కృత భారతి సంయుక్తంగా ఈ నెల 25 నుంచి ఉచితంగా సంస్కృతం నేర్పించనున్నట్లు సంస్థ ప్రతినిధులు మళ్ల వెంకటరావు, కందుకూరి సూర్యకుమారి తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని మదర్ ఇండియా ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ట్రస్ట్ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని, వయసుతో సంబంధం లేకుండా అందరూ సంస్కృత భాషను ఉచితంగా నేర్చుకోవచ్చన్నారు. సంస్కృత భాష ఎంతో ప్రాచీన మైనదని, రుగ్వేద కాలం నుంచి ఉందని, వేదాలు సంస్కృతంలో ఉన్నయని చెప్పారు. మన సంస్కృతికి మూలమైన ఆధ్యాత్మిక, తాత్విక చింతనలు, నైతిక జీవనాన్ని, సమాజ శ్రేయస్సును కలిగించే వివిధ విషయాలు సంస్కృత గ్రంథాల్లో నిక్షిప్తం చేశారన్నారు. ఆధునిక విజ్ఞాన విషయాలకు సంస్కృత సాహిత్యం, వేదాలు భాండాగారమని, హిందూ సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడానికి సంస్కృతం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 97009 85012 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు మళ్ల లక్ష్మి, రేణుక కిషోర్, అంజలి శ్రీనివాస్, పేరి భార్గవి పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న యూజీడీ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని యూజీడీ మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టారు. కొద్ది రోజులుగా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు లీకై బయటకు రావడంతో రహదారులు దుర్గంధభరితంగా మారుతున్నాయి. అటువంటి మ్యాన్‌హోల్స్‌కు యూజీడీ అధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో మ్యాన్‌హోల్స్ సమస్య తీరుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం



ఆండాళ్ అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకుడు శేషాచార్యులు, ఈవో ప్రసాద్, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆండాళ్ల తిరునక్షత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో గోదాదేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున వైభవుడికి ఉదయాస్తమాన సేవలు నిర్వహించారు. అనంతరం 9 గంటలకు ఆండాల్ అమ్మవారి ఆలయ ప్రదక్షిణ నిర్వహించి పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుప్పావై పారాయణం అనంతరం అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆండాళ్ విగ్రహదాత రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్పీ నాయుడు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. 'మన స్వాతంత్ర్యం.. సమరయోధుల త్యాగఫలం' అనే అంశంపై 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటలకు వ్యాస రచన పోటీలు, అనంతరం 1, 2, 3 తరగతుల చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 14.5 కిలోల గంజాయి పట్టివేత



రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.ఆర్.బిషోయ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. షోలాపూర్ జిల్లా, మహారాష్ట్రకు చెందిన మహిబూబ్ గులాబ్‌షేక్, తమిళనాడు మధురైకు చెందిన ఎం.మంతియస్ అక్రమంగా గంజాయిని రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖపట్నం మీదుగా షోలాపూర్, మధురైలకు తరలిస్తున్నట్లు తెలియజేశారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.72,500 విలువైన 14.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ సిబ్బంది వీరిని జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావుకు అప్పగించగా.. జీఆర్పీ సిబ్బంది నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

హరితవనం పెంపునకు చర్యలు



హరిత పార్కులో మొక్కలతో మా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్–8లోని హరిత పార్కులో హరిత వనం పెంపునకు చర్యలు తీసుకున్నారు. మా వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో బుధవారం మొక్కలు నాటారు. ఇందుకు అవసరమైన 250 ఆక్సిజన్ మొక్కలను మా వాకర్స్ క్లబ్ సభ్యులు అందించారు. పార్కులో పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హరిత పార్కు అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా కొండలరావు, దరిమిరెడ్డి దేముడు చెప్పారు. బ్యూటిఫికేషన్‌లో భాగంగా క్రమపద్ధతిలో మొక్కలు పెంచుతామన్నారు. పార్కు గౌరవాధ్యక్షుడు ఏవీఎస్ రాజు, ఇతర కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పశు గణనకు అధికారులు సిద్ధంగా ఉండాలి



పశు గణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ, అధికారులు



పశు గణన శిక్షణలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు

ఆరిలోవ: పశు గణన కోసం పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. పశు గణనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం డెయిరీ ఫారం వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఇంటిలోను పశువులు, కోళ్లు, తదితర వాటిని ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లతో కలసి జేడీ డాక్టర్ రామకృష్ణ పశు గణనకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశు గణన ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభంకానుందన్నారు. పశు గణనకు జిల్లాలో 130 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. సిబ్బంది నిబద్ధతతో గణన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రామ్మోహన్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో చేనేత దినోత్సవం



చేనేత వస్త్రాల ప్రదర్శనలో విద్యార్థినులు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రూపొందించిన చేనేత వస్త్రాలపై అందరికీ అవగాహన కలిగేలా డాక్యుమెంటరీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. పోచంపల్లి, గద్వాల్, మంగళగిరి, గుంటూరు, వెంకటగిరి, కంచి, నారాయణపేట చేనేత వస్త్రాలను విద్యార్థినులు ధరించి వాటి ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో హోం సైన్స్ విభాగాధిపతి సోని, డాక్టర్ లక్ష్మీప్రభ, పి.కె.జయలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రారంభానికి నోచుకోని ప్రజా మరుగుదొడ్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మిగిలాయి. లక్షల రూపాయల నిధులు వెచ్చించిన మరుగుదొడ్లు వినియోగం లేకుండా దర్శనమిస్తున్నాయి. స్థానికుల కోసం ఏర్పాటు చేసిన ఈ మరుగుదొడ్లను నేటికీ ప్రారంభించకుండా తాళాలు వేసి ఉంచడంతో వాటర్ ట్యాంక్ పాడవడంతోపాటు రేకులు తుప్పుపట్టాయి. స్థానికులు మరుగుదొడ్ల వద్దకు వెళ్లే చూసేసరికి తాళాలు వేసి ఉండటంతో వెనుదిరుగుతున్నారు. వెంటనే మరుగుదొడ్లు తెరవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



ఉరివేసుకుని మృతిచెందిన గుమ్ము అప్పలస్వామి

సీతమ్మధార: ఆర్థిక ఇబ్బందులు తాళ లేక ఓ ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలేనికి చెందిన గుమ్ము అప్పలస్వామి(51)కి భార్య, పిల్లలు ఉన్నారు. ఉదయం పూట ఆటో నడుపుతూ, రాత్రి వేళ తాటిచెట్లపాలెంలో జాతీయ రహదారి పక్కన గల ఖాళీ స్థలానికి కాపాలదారుడిగా ఉంటున్నాడు. ప్రైవేట్ చీటీలు పాడి చాలా మందికి లక్షలాది రూపాయలు ఇవ్వాల్సి ఉంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల నగదు లేకపోవడంతో నైట్ వాచ్‌మెన్‌గా ఉన్న చోట రేకుల షెడ్‌లో ఐరన్ రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పలస్వామి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.